సాక్షి నిజామాబాద్

ఆదివారం | 22 | అక్టోబర్ | 2023



దుర్గమ్మకు భక్తితో పూజలు

జిల్లావ్యాప్తంగా దుర్గామాత మండపాల్లో భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. అన్నదానాలు చేస్తున్నారు.

- IIIలో ▸



పండుగ పూటా పస్తులే..

రెగ్యులరైజ్ అయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రెండు నెలలుగా జీతాలు అందట్లేదు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /22.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు



సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. ర్యాండమైజేషన్ జాబితా అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించగా, పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో వాటిని నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. మున్సిపల్ కమిషనర్ ఎం.మకరంద్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.

పారా ఏషియన్ గేమ్స్ జట్టు మేనేజర్‌గా సంజీవయ్య



వేల్పూర్ : వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు తలారి సంజీవయ్య పారా ఏషియన్ గేమ్స్ భారత జట్టు మేనేజర్‌గా నియమితులయ్యారు. సంజీవయ్య సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సీనియర్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చైనాలోని హాంగ్‌హౌస్ నగరంలో ఈనెల 23 నుంచి 28 వరకు పారా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. 102 ఆసియా దేశాల నుండి 1200 మంది క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో మన దేశం నుండి 304 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ సొడ ప్రేమలత, ఎంపీటీసీ సొడ చందన్, ఉపసర్పంచ్ సొడ రమేశ్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధారాలు చూపిన వారి డబ్బుల అప్పగింత

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో మోడల్ కోడ్‌లో భాగంగా పోలీస్, ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో రూ.50వేల నగదు కంటే ఎక్కువ డబ్బులు కానీ, బంగారం వెండి కానీ ఉండి సరైన ఆధారాలు చూపకుంటే, తనిఖీ అధికారులు ఆ డబ్బులను జప్తు చేస్తారన్నారు. జప్తు చేసిన డబ్బు, బంగారం, వెండి వస్తువులు రూ.10లక్షల వరకు విడుదల చేయడానికి జిల్లా ఎన్నికల అధికారి పరిధిలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా, సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా కోశాధికారితో జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటిదాకా కమిటీ 34 జప్తు చేసిన దరఖాస్తులను, వారు సమర్పించిన ధ్రువపత్రాలు పరిశీలించిన, 28 దరఖాస్తులకు సంబంధించి రూ.90 లక్షలకు పైగా విడుదల చేశామన్నారు. ఒక దరఖాస్తుదారుని జప్తు చేసిన బంగారం వస్తువుల విలువ రూ. 10 లక్షల కన్నా మించి ఉన్నందున ఆదాయపు పన్ను విభాగానికి పంపించామన్నారు. ఎవరైనా డబ్బులు జప్తు చేస్తే సరైన పత్రాలుంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి పల్లె పాపయ్య (7997590472)ను సంప్రదించాలన్నారు.





బోర్గాంలో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

పుడమిపై పూల సింగిడి..

జిల్లా కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు కొన్నిప్రాంతాల్లో శనివారం నిర్వహించగా మరికొన్ని చోట్ల నేడు కూడా జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్, పూలాంగ్ వాగు, ఎల్లమ్మగుట్ట, దుబ్బా, శివాజీనగర్, కోటగల్లీ న్యాల్‌కల్‌రోడ్డు, కిసాన్‌గంజ్‌లో సంబురాలు నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ ఉత్సాహంగా ఆడిపాడారు.

- నిజామాబాద్ సిటీ/సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కలెక్టరేట్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్





మినీ ట్యాంక్‌బండ్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

నలుగురికి లైన్ క్లియర్!

- అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ
- బాల్కొండ నుంచి ఏలేటి అన్నపూర్ణమ్మ
- కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- జుక్కల్ నుంచి అరుణతార
- వీరందరికీ కిషన్‌రెడ్డి నుంచి ఫోన్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లాలో నలుగురికి టికెట్లు ఖరారయ్యాయి. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం టికెట్ ధన్‌పాల్ సూర్యనారాయణకు, బాల్కొండ టికెట్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మకు కేటాయించారు. శనివారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ధన్‌పాల్ సూర్యనారాయణ, అన్నపూర్ణమ్మకు ఫోన్ చేశారు. జుక్కల్‌నుంచి అరుణతారకు టికెట్ దక్కగా, కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకట రమణారెడ్డికి దక్కినట్లు సమాచారం. ఈమేరకు నామినేషన్ దాఖలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తూ వారికి అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఇందుకు సంబంధించి కసరత్తు చేశారు. జాతీయ నాయకులు సునీల్ బన్సల్, ప్రకాష్ జవదేకర్‌లతో సమావేశమైన కిషన్‌రెడ్డి ఆయా శాసనసభ స్థానాల వారీగా టికెట్ ఖరారు చేసిన అభ్యర్థులకు వరుసగా ఫోన్లు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా నుంచి ఈ ఇద్దరికీ ఫోన్లు వచ్చాయి. ఆర్మూర్ నుంచి పైడి రాకేశ్‌రెడ్డికి కూడా టికెట్ ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే ఎంపీ అర్వింద్ కోరుట్ల, బోగ శ్రావణికి జగిత్యాల టికెట్లు ఖరారయ్యాయి. బోధన్ టికెట్ మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిలలో ఒకరికి దక్కనున్నట్లు తెలుస్తోంది.



నిజామాబాద్ అర్బన్



అభ్యర్థిపేరు : ధన్‌పాల్ సూర్యనారాయణ
పుట్టిన తేదీ : 12, మే, 1958
తల్లిదండ్రులు : ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్త
భార్య : మణిమాల
పిల్లలు : ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె
వృత్తి : వస్త్ర వ్యాపారం

రాజకీయ ప్రవేశం :

- 2014లో అర్బన్ బీజేపీ అభ్యర్థిగా పోటీ. 27వేలకు పైగా ఓట్లు సాధించారు.
- 2018లో టికెట్ కోసం ప్రయత్నించినా దక్కలేదు. దీంతో శివసేన నుంచి నామినేషన్. బీజేపీ నాయకులు బుజ్జగించగా పోటీ నుంచి విరమణ.

30 ఏళ్లుగా వీహెచ్‌పీలో..

- 1984లో వీహెచ్‌పీలో సాధారణ సభ్యుడు. అనంతరం జిల్లా అధ్యక్షుడు.
- నిజామాబాద్‌లో వీహెచ్‌పీ కార్యాలయాన్ని రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించారు.
- 2014లో బీజేపీ రాజకీయ ప్రవేశంతో వీహెచ్‌పీ నుంచి తప్పుకున్నారు.
- సామాజిక సేవల్లో ముందుంటారు.

బాల్కొండ



అభ్యర్థిపేరు : ఏలేటి అన్నపూర్ణమ్మ
పుట్టిన తేదీ : మార్చి 20, 1967
విద్యార్హత : పీయూసీ
భర్త : దివంగత ఏలేటి మహిపాల్‌రెడ్డి మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ మంత్రి (టీడీపీ)
కుమారులు : ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, ఏలేటి నాగార్జున్‌రెడ్డి

రాజకీయ జీవితం :

- 1994, 2009లో ఆర్మూర్ నియోజక వర్గం(టీడీపీ) ఎమ్మెల్యేగా పని చేశారు.
- ఒక దశలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లి ఉమెన్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కూడా కొనసాగారు.
- తెలంగాణ ఆవిర్భావం తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో ఆమె బీజేపీలో చేరారు.

కామారెడ్డి



అభ్యర్థి పేరు : కాటిపల్లి వెంకటరమణారెడ్డి
తల్లిదండ్రులు : కాటిపల్లి రాజవ్వ, పెద్ద(కేపీ)రాజారెడ్డి (సమితి అధ్యక్షుడు)
భార్య : విజయ, కుమారుడు : మైత్రేయ
నివాసం : కేపీఆర్ కాలనీ, అడ్లూర్ రోడ్డు, కామారెడ్డి
పుట్టిన తేది : జనవరి 1, 1970
విద్యాభ్యాసం : ఇంటర్

రాజకీయం, పదవులు :

2006 లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తాడ్వాయి జెడ్పీటీసీగా గెలుపు.
2008 -2011 వరకు జెడ్పీ చైర్మన్
2018 లో కామారెడ్డి అసెంబ్లి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ. ఓటమి.

జుక్కల్



అభ్యర్థి పేరు : టి అరుణతార
తల్లిదండ్రులు : వసుంధర, ఆశీర్వాదం
నివాసం : బియ్యం బజార్, బిచ్కుంద
పుట్టిన తేది : నవంబర్ 30, 1972
విద్యాభ్యాసం : ఎంకాం, ఎంబీఏ, ఎల్ఎల్ఎం

రాజకీయం, పదవులు :

1999లో రాజకీయాల్లోకి రాక. అదే సంవత్సరం జుక్కల్‌నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ. కాంగ్రెస్ అభ్యర్థి సొదాగర్ గంగారాంపై 10,154 ఓట్లతో గెలుపు.
2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరిక, ఆ పార్టీనుంచి పోటీ, ఓటమి.
2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ, ఓటమి. తర్వాత కాంగ్రెస్‌లో చేరిక.
2018లో బీజేపీలో చేరి పోటీ చేసినా వరించని గెలుపు.
ప్రస్తుతం బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.



పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్థూపానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఘనంగా అమరవీరుల దినోత్సవం
- కలెక్టర్, సీపీ ఘన నివాళులు

- వివరాలు IIలో

యాసంగి ప్రణాళిక ఖరారు

- 5,07,539 ఎకరాల్లో సాగు
- వ్యవసాయ శాఖ అంచనా
- గతేడాదితో పోలిస్తే కనిపించని హెచ్చుతగ్గులు
- ఎరువులు, విత్తనాల కోసం ప్రతిపాదనలు
- పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : యాసంగి(ఎండాకాలం) సీజన్‌కు పంటల ప్రణాళిక ఖరారైంది. వరితో పాటు ఇతర ప్రధాన పంటలు కలిపి జిల్లాలో 5,07,539 ఎకరాల్లో సాగు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు శనివారం పంట అంచనా లెక్కలను విడుదల చేయగా, వరి పంటే అత్యధికంగా ఉంది. సాగు అంచనాతో పాటుగా అందుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలకు కూడా ప్రణాళికను రూపొందించారు. ఐతే, గతేడాదితో పోలిస్తే సాగు అంచనాలో పెద్దగా హెచ్చుతగ్గులు కనిపించడం లేదు. ఇటు రైతులు ఇప్పటికే యాసంగి సాగును మొదలు పెట్టారు. పొలాలను ట్రాక్టర్లతో దున్ని జొన్నలు, సజ్జలు, మక్కలు విత్తుతున్నారు. ఇటు వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. దీంతో వరికోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. దసరా తర్వాత పంట కోతలు మరింత ఊపందుకోనున్నాయి. ఈ భూముల్లో మళ్లీ వరిని సాగు చేయడానికి రైతులు వచ్చే నెలలో నార్లు పోయనున్నారు.



నూత్‌పల్లిలో పొలాన్ని దున్నుతున్న రైతు

1.48లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు

గతేడాది యాసంగిలో 1.20లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగయ్యాయి. ఐతే, ఈ యాసంగికి 1.48లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ఎరువులు 74,463 మెట్రిక్ టన్నులు, డీఏపీ 18,194 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 11,942 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 43,446 మెట్రిక్ టన్నులు అవసరం కానున్నట్లు ప్రతిపాదనలు రూపొందించింది. గత యాసంగితో పోలిస్తే 18వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అదనంగా అంచనా వేశారు. అదే విధంగా విత్తనాల ధరలు కూడా ఖరారు చేశారు. వరి విత్తనాలు కిలో రూ.25, మొక్కజొన్న విత్తనాలు కిలో రూ.8, శనగ విత్తనాలు కిలో రూ.25, మినుములు కిలో రూ.8 చొప్పున విత్తన ధరలున్నాయి.

పంట	సాగు అంచనా (ఎకరాల్లో)	విత్తన అంచనా (క్వింటాళ్లు)
వరి	3,99,818	99,954
మొక్కజొన్న	23,710	1,897
శనగ	22,572	5,643
మినుములు	187	15
సజ్జలు	8,571	343
నువ్వులు	14,370	287
పొద్దుతిరుగుడు	5,598	112
కుసుమలు	337	14
జొన్నలు	27,348	684
ఇతర పంటలు	5,028	00

ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది లేదు

ఎండాకాలం సీజన్లో సాగయ్యే పంటల అంచనా లెక్కలను పక్కాగా తీశాం. సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతాం. ఎలాంటి కొరత రానివ్వం. రైతులు అవసరానికి అనుగుణంగా ఎరువులను తీసుకెళ్లాలి. పంటలు సాగు చేసే ముందు స్థానిక ఏఈవోలను సంప్రదిస్తే సలహాలు, సూచనలు చేస్తారు.

- వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

సెయింట్‌ పాల్స్‌ హైస్కూల్‌ సీజ్‌



ఆర్మూర్‌టౌన్‌: ప్రైవేటు ఫైనాన్స్‌ కంపెనీ నుంచి తీసుకున్న రుణం చెల్లించలేని ఆర్మూర్‌ పట్టణంలోని సెయింట్‌ పాల్స్‌ హైస్కూల్‌ను నిజామాబాద్‌ కోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం సీజ్‌ చేశారు. సేయింట్‌ పాల్స్‌ హైస్కూల్‌ యాజమాన్యం వర్ధన ఫైనాన్స్‌ నుంచి 2016 సంవత్సరంలో రూ.3 కోట్లను మార్టిగేజ్‌ ద్వారా రుణం తీసుకున్నారు. కాగా రుణం చెల్లించక పోవడంతో సదరు ఫైనాన్స్‌ కంపెనీ వారు పలుమార్లు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. అయినా యాజమాన్యం స్పందించక పోవడంతో ఫైనాన్స్‌ కంపెనీ వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు అడ్వకేట్‌ కమిషనరు కొత్తపల్లి రాములుతో పాటు సహాయకులుగా తుమ్మ సుకేష్‌ను నియమించి పాఠశాలను సీజ్‌ చేయించారు. ఈ సందర్భంగా కంపెనీ లీగల్‌ మేనేజర్‌ అభిషేక్‌ పటేల్‌ మాట్లాడుతూ.. జప్తు చేసిన స్థిరాస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించి బకాయిలను తీసుకుంటామని వెల్లడించారు.

ఘనంగా దేవి శోభాయాత్ర



నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన భవానీమాత ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బిగాల గణేశ్‌ గుప్తా ప్రారంభించారు. పోచమ్మగల్లీ నుంచి దేవీరోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. భవానీ యూత్‌ వ్యవస్థాపకుడు, ర్యాలీ నిర్వాహకుడు పబ్బ సాయిప్రసాద్‌, దీక్షాపరులు పాల్గొన్నారు.

డీజేలు పెడితే చర్యలు

మోపాల్‌: బతుకమ్మ, దుర్గామాత, దసరా ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా డీజే పెడితే యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై గంగాధర్‌ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం పీఎస్‌లో డీజే నిర్వహకులకు కౌన్సిలింగ్‌ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎంప్లాయ్‌ ఐడీ కేటాయించి జీతాలివ్వాలి



సుభాష్‌నగర్‌ : ఆఫీస్‌ సబార్డినేట్ల కోర్టు కేసు ముగిసినందున వీఆర్‌ఏల నుంచి జూనియర్‌ అసిస్టెంట్లు, రికార్డ్‌ అసిస్టెంట్లు, ఆఫీస్‌ సబార్డినేట్లుగా పేస్కేల్‌ కల్పించిన వారికి ఎంప్లాయ్‌ ఐడీలు కేటాయించి వెంటనే జీతాలు చెల్లించాలని ట్రెసా ప్రతినిధులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సీసీఎల్‌ఏ, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఆఫీస్‌ సబార్డినేట్లకు జూనియర్‌ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై నవీన్‌ మిట్టల్‌ సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కె గౌతమ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, రమేష్‌ పాక, నిజామాబాద్‌ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, సుధాకర్‌, వీఆర్‌ఏలు, ఆఫీస్‌ సబార్డినేట్లు పాల్గొన్నారు.

టీడీపీ కోటలో గులాబీ పాగా

- ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు
- టీడీపీ ఐదు సార్లు, కాంగ్రెస్‌ నాలుగు సార్లు, బీఆర్‌ఎస్‌ నాలుగు సార్లు ప్రాతినిథ్యం
- ఆర్‌పీఐ నుంచి ఒకరు, ఎన్‌టీపీఎస్‌ నుంచి ఒకరికి అవకాశం
- రెండు సార్లు ఉప ఎన్నిక
- ఈ ఎన్నికల్లో గెలిచేదెవరో?





తాడూరి బాలాగౌడ్‌



నేరెళ్ల ఆంజనేయులు



ఏనుగు రవీందర్‌రెడ్డి



బోగుడమీది జనార్దన్‌గౌడ్‌



జాజాల సురేందర్‌

ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించిన వారు

సంవత్సరం	పేరు	పార్టీ
1962–67	టీఎస్‌ సదాలక్ష్మి	కాంగ్రెస్‌
1967–72	జె.ఈశ్వరీబాయి	ఆర్‌పీఐ
1972–78	జె.ఈశ్వరీబాయి	ఎస్‌టీపీఎస్‌
1978–83	తాడూరి బాలాగౌడ్‌	కాంగ్రెస్‌
1983–85	లింగారెడ్డిగారి కిషన్‌రెడ్డి	టీడీపీ
1985–89	ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
1989–94	నేరెళ్ల ఆంజనేయులు	టీడీపీ
1994–99	నేరెళ్ల ఆంజనేయులు	టీడీపీ
1999–04	నేరెళ్ల ఆంజనేయులు	టీడీపీ
2004–08	ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2008–09 (ఉపఎన్నిక)	బొగుడమీది జనార్దన్‌గౌడ్‌	కాంగ్రెస్‌
2009–10	ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2010–14 (ఉపఎన్నిక)	ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2014–18	ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌
2018–23	జాజాల సురేందర్‌	కాంగ్రెస్‌

ప్రస్తుతం నియోజకవర్గ

ఓటర్లు	: 2,17,444
పురుషులు	: 1,12,673
మహిళలు	: 1,04,768
ఇతరులు	: 03

దనాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గం ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉండేది. తెలంగాణ ఉద్యమం మొదలైన నాటి నుంచి నియోజకవర్గ ఓటర్లు బీఆర్‌ఎస్‌ వైపు నిలిచారు. అక్కడి నుంచి టీడీపీ కంచుకోటలో బీఆర్‌ఎస్‌ పాగా వేసినట్లయింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు అడ్డాగా మారింది. 1962లో ఏర్పడ్డ ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఇప్పటి వరకు 13 సార్లు సాధారణ ఎన్నికలు, 2008, 2010లో రెండు సార్లు ఉప ఎన్నికలు జరిగాయి. టీడీపీ ఐదుసార్లు, కాంగ్రెస్‌ నాలుగు సార్లు, బీఆర్‌ఎస్‌ నాలుగు సార్లు విజయం సాధించగా ఆర్‌పీఐ నుంచి ఒకరు, ఎన్‌టీపీఎస్‌ నుంచి మరొకరు గెలుపొందారు. ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులకే ఓటర్లు పట్టం కడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి మొదలైంది.

హ్యాట్రిక్‌ వీరులు ఇద్దరు..

1962లో నిర్వహించి న ఉమ్మడి నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి టీఎస్‌ సదాలక్ష్మి ఎమ్మెల్యేగా గెలుపొంది దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగారు. 1967లో ఎల్లారెడ్డి ప్రత్యేక నియోజకవర్గం ఏర్పడగా నిర్వహించిన ఎన్నికల్లో రిపబ్లికన్‌ పా ర్టీ ఆఫ్‌ ఇండియా నుంచి జె.ఈశ్వరీబాయి గెలుపొందారు. 1972లో సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి నుంచి జె.ఈశ్వరీభాయి ఎమ్మెల్యేగా, 1978లో తా డూరి బాలాగౌడ్‌ కాంగ్రెస్‌ నుంచి గెలుపొందగా చ క్కెర పరిశ్రమ, రోడ్లు–భవనాలశాఖ మంత్రిగా కొనసాగారు. దీంతోపాటు బాలాగౌడ్‌ రెండుసార్లు నిజామాబాద్‌ పార్లమెంట్‌ స్థానం నుంచి పోటీచేసి ఎంపీగా గెలుపొందారు. 1983లో టీడీపీ నుంచి లింగారెడ్డిగారి కిషన్‌రెడ్డి, 1985లో టీడీపీ నుంచి ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, 1989ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన నేరెళ్ల ఆంజనేయులు 1994, 1999ఎన్నికల్లోనూ టీడీపీ తరఫున పోటీచేసి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్‌ సాధించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుస విజయాలతో ఎల్లారెడ్డి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా మారింది. కానీ 2004లో బీఆర్‌ఎస్‌ నుంచి ఏనుగు రవీందర్‌ రెడ్డి, 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి బోగుడమీది జనార్దన్‌గౌడ్‌, 2009లో బీఆర్‌ఎస్‌ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, 2010 ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి గెలుపొందారు. కాగా 2010 ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎల్లారెడ్డి అసెంబ్లీస్థానానికి అత్యధిక సంఖ్యలో సుమారు 100కుపైగా మంది అభ్యర్థులు పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డికే ప్రజలు పట్టం కట్టారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి జాజాల సురేందర్‌ 35వేల ఓట్ల భారీమెజార్టీతో సమీప ప్రత్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం రాజకీయ పరిణామాలతో ఎమ్మెల్యే సురేందర్‌ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టు



విజేతగా నిలిచిన క్రీడాకారులతో నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: మహబూబ్‌నగర్‌ జిల్లా రాజాపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీల్లో జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శి సంగీతరావు శనివారం తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ వాలీబాల్‌ అండర్‌–17 విభాగంలో నిర్వహించిన టోర్నమెంట్‌ ఫైనల్‌ మ్యాచ్‌లో జిల్లా బాలికల జట్టు నల్గొండ జట్టుపై విజయం సాధించి బంగారు పతకం సాధించింది. అనంతరం బాలికల జట్టును, కోచ్‌ మేనేజర్లుగా వ్యవహరించిన మల్లేశ్‌గౌడ్‌, రాజ్‌కుమార్‌, యాదగిరిలను సంగీతరావు, కామారెడ్డి ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి నయాబ్‌రసూల్‌ అభినందించారు.

క్రైం కార్నర్‌

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ధర్పల్లి: మండలంలోని మైలారంలో పాము కాటుకు గురై ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బ్రాహ్మణపేట్‌కు చెందిన సురావత్‌ రూప్‌సింగ్‌ (38) మండలంలోని మైలారం గ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం వరి పంటను కోసేందుకు హార్వెస్టర్‌ మిషన్‌ రావడంతో పొలం గట్లను రూప్‌సింగ్‌ గడ్డపారతో దవ్వుతుండగా పాముకాటు వేసింది. దీంతో అతడిని డిచ్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

రెంజల్‌: మండలంలోని నీలా గ్రామానికి చెందిన మేడి పోశెట్టి(49) జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని పెద్దవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ శనివారం తెలిపారు. వ్యవసాయ పనులు చేసే పోశెట్టి కొంత కాలంగా అనారాగ్యోనికి గురయ్యాడు. ఆసుప్రతుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో గ్రామ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని ప్రభుత్వ ఆసుప్రతికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ధ్వంసం



ఎడపల్లి: మండలంలోని ఠానాకలాన్‌ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి, కాపర్‌ను దొంగిలించినట్లు విద్యుత్‌శాఖ అధికారులు శనివారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని అన్నారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. రెండు లక్షల నగదు చోరీ



బాల్కొండ: మండల కేంద్రంలో ఒకరు ఇంటి ఎదుట పార్క్‌ చేసిన స్కూటీ నుంచి గుర్తు తెలియని దుండగులు రూ. రెండు లక్షల నగదును ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌ చందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాగుల నర్సాగౌడ్‌ స్థానిక యూనియన్‌ బ్యాంకు నుంచి రూ. 2లక్షల నగదును డ్రా చేసి స్కూటీలో పెట్టుకుని ఇంటికి వెళ్లాడు. మార్గమధ్యలో మండల కేంద్రానికి చెందిన జక్కుల నర్సయ్య ఇంటి ఎదుట స్కూటీని పార్కు చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఏసీపీ పరిశీలించి విచారణ చేపట్టారు. ఏసీపీ వెంట ఎస్సై గోపి, సిబ్బంది ఉన్నారు.

పండుగ పూటా పస్తులే..

- క్రమబద్ధీకరింపబడిన జేపీఎస్‌లకు రెండు నెలలుగా అందని వేతనాలు
- ఉద్యోగుల గుర్తింపు కార్డును ట్రెజరీల్లో అందించడంలో తీవ్ర జాప్యం

మోర్తాడ్‌: ప్రభుత్వ నిర్వాకంతో రెగ్యులరైజ్‌ చేయబడిన జూనియర్‌ పంచాయతీ ఉద్యోగులకు రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ పూర్తి చేసుకున్న జేపీఎస్‌లకు రెగ్యులర్‌ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్‌ అమలు చేయాల్సి ఉంది. గడిచిన ఆగస్టు 15 నుంచి వీరు రెగ్యులర్‌ ఉద్యోగులుగా పరిగణించబడుతున్నారు. నాటి నుంచి వీరికి గతంలో ఇచ్చిన గౌరవ వేతనానికి బదులు రెగ్యులర్‌ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్‌ అమలు కావాల్సి ఉంది. కొత్త వేతనం అందించాలంటే ఉద్యోగులు గుర్తింపు కార్డులను ట్రెజరీ కార్యాలయాల్లో అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. క్రమబద్ధీకరణ చేయబడిన ఉద్యోగులకు గుర్తింపు కార్డులను జారీ చేసే బాధ్యత అధికారులపైనే ఉంది. జిల్లాలో 261 మంది జేపీఎస్‌లు రెగ్యులరైజ్‌ చేయబడ్డారు. వీరికి కొత్త వేతనం అందించడానికి అధికారులు మొదట్లో కొర్రీలు పెట్టారు. గుర్తింపు కార్డులను జత పరిచిన తరువాత ట్రెజరీలకు వేతనాల బిల్లును పంపించారు. ఆ కార్యాలయాల నుంచి టోకెన్‌లు జారీ చేసినా నిధుల కొరత కారణంగా జేపీఎస్‌లకు వేతనాలు ఖాతాల్లో జమ కాలేదు. దసరా పండుగ వచ్చినా వేతనాలు చేతికి అందకపోవడంతో జేపీఎస్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగకు వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సంబురాలు ఎలా జరుపుకోవాలో అర్థం కావడం లేదని జేపీఎస్‌లు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతోనే తమ వేతనాలు సకాలంలో చేతికి అందలేవని జేపీఎస్‌లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 4.30 లక్షల నగదు పట్టివేత



బాన్సువాడ: వాహన తనిఖీల్లో భాగంగా మండలంలోని తాడ్కోల్‌ చౌరస్తా వద్ద పోగు శ్రీనివాస్‌ అనే వ్యక్తి నుంచి రూ.4.30లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నగదును ఫ్లయింగ్‌ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

డొంకేశ్వర్‌లో వాహనాల తనిఖీ



డొంకేశ్వర్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డొంకేశ్వర్‌ మండల కేంద్రంలో వాహన తనిఖీలను అధికారులు ముమ్మరం చేస్తున్నారు. కలెక్టర్‌ నియమించిన ఎస్‌ఎస్‌టీ అధికారుల బృందం కార్లు, ఆటోలు, డీసీఎం వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. అక్రమంగా డబ్బు, బంగారం, మద్యంను తరలించకుండా వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేస్తున్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు
- అమర పోలీసులకు ఘన నివాళి

ఖలీల్‌వాడి: శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలూ శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అన్నారు. శనివారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌తో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ, ఎంతో విలువైన ప్రాణాలు కోల్పోయిన అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతన్నారు. ఈ సందర్భంగా 1986 నుంచి ఇప్పటివరకు జిల్లాలో అమరులైన 19 మంది పోలీసు అమర వీరుల కుటుంబాలకు కలెక్టర్‌ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. అనంతరం పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 189 మంది పోలీసులు అమరులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజ్‌, ఏసీపీ కిరణ్‌ కుమార్‌, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏడో బెటాలియన్‌లో..



నివాళి అర్పిస్తున్న కమాండెంట్‌ రాంప్రకాశ్‌

డిచ్‌పల్లి: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేవని ఏడో బెటాలియన్‌ కమాండెంట్‌ బి.రాంప్రకాశ్‌ అన్నారు. శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బెటాలియన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కమాండెంట్‌, అసిస్టెంట్‌ కమాండెంట్లతో పాటు సిబ్బంది, అమర వీరుల కుటుంబాల సభ్యులు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళి అర్పించారు. కమాండెంట్‌ మాట్లాడుతూ.. సంఘ విద్రోహులను అరికట్టేందుకు పోలీసులు మరింత కృషి చేయాలన్నారు. ఈ విషయంలో బెటాలియన్‌ పోలీసుల సేవలు మరువలేనివని, విధినిర్వహణలో ఇప్పటివరకు ఏడో బెటాలియన్‌కు చెందిన 11 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్లు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌.విష్ణుమూర్తి, కె.భాస్కర్‌రావు, సి.ఆంజనేయరెడ్డి, యూనిట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అనుపమ, ఏవో సి.హంసరాణి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, అమర పోలీసుల కుటుంబాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న పోలీస్‌ అమరుల కుటుంబ సభ్యులు



నివాళి అర్పిస్తున్న పోలీసు సిబ్బంది

అధికారుల నిర్లక్ష్యం..

- పొలాల్లోకి చేరుతున్న కాలువ నీరు
- నష్టపోతున్న రైతులు



లిఫ్టు కాలువ నుంచి ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని వేంపల్లి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ నుంచి సరఫరా అవుతున్న ఎల్‌–1 కాలువ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు రాత్రి వేళల్లో నీటిని అధికంగా విడుదల చేస్తుండడంతో కాలువ నుంచి పొంగి పంట భూముల్లోకి నీరు చేరుతోంది. దీంతో పంటలు పూర్తిగా నీటి మయమవుతున్నాయి. పంట భూముల్లో నీరు ఇలా చేరితే పంటలను ఎలా విత్తుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ డీ3 ఆధారంగా వేంపల్లి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈపథకం నుంచి ఎల్‌–1 కాలువ ద్వారా రెంజర్ల మీదుగా మోర్తాడ్‌ మండలం ధర్మోరా చెరువుకు నీటి సరఫరా జరుగుతోంది. కానీ కాలువలో పిచ్చిమొక్కలు నిండిపోవడం, పూడికమయంగా మారడంతో నీరు సరిగా ప్రవహించడం లేదు. ఫలితంగా కాలువలోని పంట భూముల్లోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జొన్న పంట విత్తేందుకు రైతులు నేలను సిద్ధం చేసుకుని బోయా వేసి పెట్టారు. కానీ కాలువ నీరు ప్రవహించడంతో పంట భూముల్లో చెరువును తలపించేలా పారుతోంది. మరో 15 రోజుల వరకు జొన్న పంటను విత్తుకునే అవకాశం లేకుండ పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కిక్కిరిసిన మేకల సంత

- దసరా సందర్భంగా జోరుగా కొనుగోళ్లు
- రూ. 4 కోట్ల లావాదేవీలు

నవీపేట : మండల కేంద్రంలోని మేకల సంత శనివారం వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. గతవారం వరకు అంతంతమాత్రమే కొనసాగిన క్రయవిక్రయాలు దసరా ప్రభావంతో ఒక్కసారిగా ఊపందుకున్నాయి. శుక్రవారం సాయంత్రమే మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని వ్యాపారులతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తమ వాహనాల్లో జీవాలను తీసుకుని ఒక రోజు ముందే వచ్చారు. దసరా నేపథ్యంలో జీవాలకు డిమాండ్‌ పెరిగింది. సంత ప్రాంగణంలో స్థలం దొరుకకపోవడంతో బస్టాండ్‌ పరిసర ప్రాంతాలతో పాటు నెహ్రూ రోడ్డు, బాసర రహదారుల వెంబడి క్రయవిక్రయాలు జరిపారు. బాసర రహదారి పక్కనే ఈ సంత ఉండడంతో ఉదయం వేళలో ట్రాఫిక్‌ సమస్య తలెత్తింది. ఈ సంతలో రూ. 4 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉండడంతో కొందరు వ్యాపారులు నగదు లావాదేవీలకు భయపడి ఆన్‌లైన్‌ పేమెంట్లు జరిపారు.

చెక్‌పోస్టు పరిశీలన



కందకుర్తిలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఏసీపీ

రెంజల్‌: మండలంలోని కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు బోధన్‌ ఏసీపీ కిరణ్‌కుమార్‌ పేర్కొన్నారు. శనివారం చెక్‌పోస్టును సందర్శించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట రూరల్‌ సీఐ శ్రీనివాసరాజ్‌, ఎస్సై ఉదయ్‌కుమార్‌ ఉన్నారు.

వాహనాల్లో మద్యం తరలించొద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్‌ సీఐ

ఎల్లారెడ్డి: వాహనాల్లో మద్యం తరలిస్తే వాహనాలను సీజ్‌ చేస్తామని ఎక్సైజ్‌ సీఐ షాకీర్‌ అహ్మద్‌ అన్నారు. ఎల్లారెడ్డిలో ఎక్సైజ్‌ అధికారులు నిజామాబాద్‌ ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ దశరథ్‌, కామారెడ్డి ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ రవీందర్‌రాజు ఆదేశాల మేరకు శనివారం వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని వాహనాల్లో తరలిస్తే సీజ్‌ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించిన వారిపై ఎక్సైజ్‌ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై జలీలుద్దీన్‌, సిబ్బంది ఉన్నారు.

గడ్కోల్‌లో మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

సిరికొండ: నిజామాబాద్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, భీంగల్‌ ఎక్సైజ్‌ బృందం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి మండలంలోని గడ్కోల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ వేణుమాధవ్‌రావు తెలిపారు. దాడిలో రూ. 70 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న నిశాంత్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న, హెడ్‌ కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌, ప్రసాద్‌, ఫయాజ్‌, కానిస్టేబుళ్లు భోజన్న, ఉత్తమ్‌, శ్రీనివాస్‌రెడ్డి, దత్తాద్రి పాల్గొన్నారు.

యావదాస్తి ప్రజా సంక్షేమానికే వెచ్చిస్తా

- ట్రస్టు పేరిట రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తా
- ఎన్నికల్లో ఓడినా సేవా కార్యక్రమాలు ఆగవు
- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి
- నియోజకవర్గ సొంత మేనిఫెస్టో విడుదల


మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ''నా యావదాస్తి ఇక ప్రజా సంక్షేమం కోసం, సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తా.. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎన్నికల్లో ఓడినా గెలిచినా ఎల్లకాలం ఈ ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా'' అని కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ప్రకటించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో తన మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి కేపీ రాజారెడ్డి జన సేవా ట్రస్టు పేరిట రూ. 150 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కామారెడ్డిలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రతి మండల కేంద్రంలో ఒక ఉచిత జనరల్ ఆస్పత్రి, మోడల్ స్కూల్ నిర్మిస్తానన్నారు. అలాగే మోడల్ స్కూల్, యువత కోసం ఉపాధి, క్రీడా శిక్షణ కేంద్రాలు, రైతుల కోసం ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రాలు, సీసీ కల్లాలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు రూ.150 కోట్లు అవసరమవుతాయని, ఈ నిధులతో ఏడాదిలోనే ఆయా పనులు చేపడతానని పేర్కొన్నారు. ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూమిని ప్రభుత్వం ఇవ్వకపోతే ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసైనా పనులు చేపడతానన్నారు. కామారెడ్డి శివారులో తనకున్న 11 ఎకరాల భూమిని సైతం సేవా కార్యక్రమాలకు ఇస్తానని ప్రకటించారు. తన మిత్రులు, ఎన్ఆర్ఐలు, ఇతరుల నుంచి విరాళాలు సేకరించి సేవా కార్యక్రమాలను ఎల్లకాలం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. కామారెడ్డి అభివృద్ధే తన ధ్యేయమన్నారు. నిధులు సమకూరడాన్ని బట్టి ఈ సేవా కార్యక్రమాలను జిల్లా మొత్తానికి విస్తరింపజేస్తానన్నారు. తేలు శ్రీనివాస్, మోటూరి శ్రీకాంత్, కాసర్ల శ్రీనివాస్, నరేందర్, పండ్ల ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో కాగితపు బతుకమ్మల విక్రయాలు


గునుగుపూవు కొనుగోలు చేస్తున్న మహిళలు

కామారెడ్డిలో నేడు సద్దుల బతుకమ్మ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో నేడు సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు. దీంతో శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో సందడి నెలకొంది. సుభాష్‌రోడ్, జేపీఎన్ రోడ్, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో గునుగు, తంగడి, బంతి, చామంతి తదితర పూల విక్రయాలు జోరుగాసాగాయి. కాగితపు బతుకమ్మలను విక్రయించారు. బతుకమ్మ సంబురాల కోసం మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


డైలీ మార్కెట్‌లో మహిళల సందడి

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఖలీల్‌వాడి: వచ్చే ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రతి పౌరుడు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల విధివిధానాలు పాటించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల చట్టం గూర్చి వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేశ్, చిదిరాల రాణి మాట్లాడుతూ ప్రజలు, రాజకీయ పార్టీలు తమ అవసరాల కోసం డబ్బులను చట్టపరిమితిలో వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం నియమించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్యామ్ రావు, బంటు వసంత్, ఖాందేశ్ శ్రీనివాస్‌లను సన్మానించారు. సమావేశంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శేషు, సమ్మయ్య, వీరయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ఎలక్షన్ కోడ్' ఫిర్యాదులపై స్పందించాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్


వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్, సీపీ, అదనపు కలెక్టర్, కామారెడ్డి కలెక్టర్, ఎస్పీ, అధికారులు

సుభాష్‌నగర్/కామారెడ్డి క్రైం: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో శనివారం రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ యాదవ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు సీఈవో దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులను సత్వరమే పరిశీలిస్తూ, ఎన్నికల సంఘానికి నివేదిక పంపాలన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల విషయంలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలని, ప్రతిరోజు ఎంసీఎంసీకి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. నగదు జప్తు చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ ప్రజలు, వ్యాపార వర్గాలు వంటి వారు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలన్నారు. వీసీలో నిజామాబాద్ నుంచి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, కామారెడ్డి నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, నోడల్ అధికారులు సాయన్న, కిషన్, శ్రీనివాస్, బావయ్య, శ్రీధర్ రెడ్డి, సురేందర్ కుమార్, సతీష్ యాదవ్, శాంతి కుమార్ పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కామారెడ్డి కలెక్టర్ నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తనిఖీల్లో అనవసర ఆర్భాటం చేసి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు


బతుకమ్మతో డీపీవో జయసుధ, యువతి


బతుకమ్మకు పూజలు చేస్తున్న ఉద్యోగినులు


బతుకమ్మలతో ఉద్యోగినులు

సుభాష్‌నగర్: నగరంలోని కొత్త కలెక్టరేట్ ఆవరణలో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, అధ్యక్షుడు అలుక కిషన్ అధ్యక్షతన శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధానకార్యదర్శి మారం జగదీశ్వర్ హాజరయ్యారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్, నేతికుంట శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, సత్యనారాయణ గౌడ్, నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కొండల్ రెడ్డి, పోల శ్రీనివాస్, సతీష్‌కుమార్, జాఫర్ హుస్సేన్, జాకీర్, ఉమా కిరణ్, అతిక్ తదితరులు పాల్గొన్నారు.

సోయాల నిల్వకే రైతుల మొగ్గు

- ధర లేకపోవడంతో విక్రయాలపై అనాసక్తి


తిమ్మాపూర్‌లో ఆరబోసిన సోయాలు

మోర్తాడ్: మార్కెట్‌లో సోయా గింజలకు ధర తగ్గుతుండటంతో రైతులు పంటను నిల్వ చేసుకునే అంశంపై దృష్టి పెట్టారు. గతంలో సీజను ముగిసిన తర్వాత సోయాలకు ధర అమాంతం పెరిగింది. ఒక దశలో క్వింటాలుకు రూ.8వేల వరకు ధర లభించింది. ఈ సారి అకాల వర్షాలు, నాణ్యత లేని విత్తనాలతో సోయా దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. సోయా దిగుబడి తగ్గినా వ్యాపారుల సిండికేట్ కారణంగా ధర రూ.4వేలకు మించడం లేదు. సోయాలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4,600 ఉంటే కొనుగోలు కేంద్రాలు లేని కారణంగా మద్దతు ధర అమలులోకి రాలేదు. సోయా దిగుబడి ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు రావాలి. కానీ ఈసారి 3 నుంచి 5 క్వింటాళ్లకు పరిమితమైంది. సోయాకు ధర రూ.5వేల నుంచి రూ.6వేల వరకు లభిస్తేనే విక్రయిస్తామనే ఉద్దేశంతో రైతులు సోయా నిల్వపై ఆసక్తి చూపుతున్నారు. కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేకపోయినా ఇళ్లలో నిల్వ చేసుకుంటే మూడు నెలల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. మూడు నెలల కంటే ఎక్కువ రోజులు నిల్వ చేయాలంటే కోల్డ్ స్టోరేజీలు అవసరం అవుతాయి. మూడు నెలల్లో సోయాకు ధర పెరుగుతుందనే రైతులు భావిస్తున్నారు.

70 స్థానాల్లో పోటీ చేస్తాం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలో 70 నియోజకవర్గాల్లో ఉత్తర తెలంగాణ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన అరాచకంగా మారిందన్నారు. తమ పార్టీకి మద్దతు తెలిపితే అన్ని విధాలుగా ప్రజలకు అండగా ఉంటుందన్నారు. నాయకులు అశోక్, నర్సయ్య, రాజయ్య, ఓం ప్రకాష్, బాలరాజ్‌కుమార్, దేవిదాస్ పాల్గొన్నారు

'అందమైన' లక్ష్యం వైపు..



కలలు అందరూ కంటారు.. కానీ ఆ కలల్ని నిజం చేసుకోవడంలో అమితమైన సంతృప్తి ఉంటుంది. ఇతరులు వేసినబాటలో మనం నడవకుండా మనకంటూ ప్రత్యేకతను కనబర్చుకుంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు వెళ్తే కలిగే ఆనందం వేరేగా ఉంటుంది. ఆ దిశలోనే ప్రయాణిస్తూ తనను తాను వెతుక్కుంటూ ముందుకు వెళ్లిన యువతే నిషిత తిరునగరి. తళుకుల అందాల ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచుకుంది. అందమైన లక్ష్యంవైపు దూసుకుపోతోంది.

- మిస్ క్వీన్ ఆఫ్ ది వరల్డ్ ఇండియా -2023గా నిర్మల్ యువతి
- ఫ్యాషన్ రంగంపై అమితాసక్తితోనే అరుదైన ఘనత
- గతంలోనూ ఎన్నో టైటిల్స్ సొంతం..


అమ్మానాన్నలతో నిషిత

సాధించిన ఘనతలు..

- గతేడాది ముంబైలో నిర్వహించిన క్వీన్ ఆఫ్ వరల్డ్–2022 పోటీల్లో 'మిస్ ఫొటో జెనిక్ క్వీన్' టైటిల్ సొంతం చేసుకుంది.
- అదే సంవత్సరం జూలైలో 'మిస్ ఇండియా యూనైటెడ్ కాంటినెంట్స్–2022' నందు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించింది.
- జాతీయస్థాయిలో 'మిస్ యాక్టీవ్' గా ఎంపికైంది. 'మిస్ సోషల్ క్వీన్' గానూ టైటిల్ సొంతం చేసుకుంది.

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే...

ఫ్యాషన్ రంగంలో నిలదొక్కుకోవడం, మోడలింగ్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడం కాస్త సాహసంతో కూడుకున్నదే. అయినా అమ్మానాన్నలు, సోదరుడు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే ఈ రంగంలో ముందుకువెళ్తున్నాను. రానున్న రోజుల్లో మిస్ వరల్డ్ టైటిల్‌ను భారత్‌కు అందించాలన్నదే నా లక్ష్యం.

– తిరునగరి నిషిత, నిర్మల్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ఈద్గాం కాలనీకి చెందిన తిరునగరి సరళ–మనోహరస్వామి దంపతుల కుమార్తె తిరునగరి నిషిత ఫ్యాషన్ రంగంపై మక్కువతో ఎదుగుతూ రెండు రోజులక్రితం మరో అరుదైన ఘనతను సాధించింది. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన 'మిస్‌క్వీన్ ఆఫ్ వరల్డ్ ఇండియా -2023' పోటీల్లో రన్నరప్‌గా ప్రతిభను చాటింది. స్వల్ప తేడాతో విన్నర్ స్థానం చేజారినా రన్నరప్‌గా నిలవడంపై బంధుమిత్రులు, స్థానికులు, జిల్లావాసులు అభినందిస్తున్నారు. అమ్మ సరళ గృహిణి కాగా, నాన్న విద్యుత్‌శాఖలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ఫ్యాషన్ రంగంపై మక్కువతో..

బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిషిత ఫ్యాషన్ రంగంపై అమితమైన ఇష్టంతో, భవిష్యత్తుపై తనకున్న నమ్మకంతోనే ధైర్యంగా ఈ రంగంలో అడుగుపెట్టింది. తల్లిదండ్రులూ ప్రోత్సహించారు. ఆమె 18 రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది యువతులు ,మహిళలకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ కోర్సును నేర్పిస్తుండడం గమనార్హం. కరాటే బ్లాక్‌బెల్ట్ కూడా పొంది ఉన్నారు. నిషితకు పాఠశాల స్థాయి నుంచే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలంటే ఆసక్తి. డిగ్రీ తర్వాత ఉద్యోగంలో చేరినా, సృజనకు ఏమాత్రం ఆస్కారం లేని ఆ కొలువు తనకు సంతృప్తి నివ్వలేదు. తనకిష్టమైన మోడలింగ్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని నిరంతరం పరితపించింది. అందుకే మోడలింగ్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకుంది. కుటుంబసభ్యులు సైతం ప్రోత్సహించారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ...

అందమైన లక్ష్యం కోసం ముంబై చేరిన నిషిత అక్కడ కోకోబెరి సంస్థలో మోడలింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఫ్యాషన్ టెక్నాలజీలో శిక్షణ పొందింది. రష్యాకు చెందిన అంతర్జాతీయ మోడల్ ఆలీసియా రౌత్ వద్ద ఫ్యాషన్ మెలకువలు నేర్చుకుంది. ఆ నైపుణ్యంతోనే అందాల పోటీలు ఎక్కడ జరిగినా వాటిల్లో పాల్గొంటూ ప్రతిభను కనబర్చుతోంది.

సామాజిక సేవలోనూ తనదైన పాత్ర..

నిషిత సామాజిక సేవలోనూ తనదైన శైలిలో విభిన్న పాత్ర పోషిస్తోంది. ప్రాజెక్టు స్ఫూర్తి పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను కూడా ఏర్పాటు చేసింది. దీని ద్వారా మహిళలు, యువతుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించేందుకు తనవంతు కృషి చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తోంది.

ఎస్సీ వర్గీకరణపై వైఖరి స్పష్టం చేయాలి

- నవంబర్‌లో విశ్వరూప మహాసభ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మంచిర్యాలక్రైం: నవంబర్ 30న జరిగే ఎన్నికలకు ముందే ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరి స్పష్టం చేయాలని, పార్లమెంటు శీతాకాలపు సమావేశాల్లో తేల్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బిల్లులు అన్నింటికీ ఆమోదం లభించిందని, శీతాకాలం సమావేశాల్లో ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా గళం విప్పే వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణపై తేల్చనిపక్షంలో మాదిగల విశ్వరూప మహాసభలో తమ బలం చూపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, పట్టణ ఇన్‌చార్జి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గొడిశల దశరథం, మల్లేష్, శంకర్, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగనీళ్ల మహాజాతర

అడెల్లి మహాపోచమ్మ అమ్మవారు



- బందోబస్తు నడుమ గోదావరికి అమ్మవారి ఆభరణాలు
- నేడు అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ఆభరణాల అలంకరణ, జాతర
- వేలాదిగా తరలిరానున్న భక్తులు


అడెల్లి ఆలయం నుంచి అమ్మవారి ఆభరణాలను పవిత్రగోదావరి నదికి తరలిస్తున్న భక్తులు

సారంగపూర్: భక్తుల ఇలవేల్పు అయిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు ఈవో రవికిషన్‌గౌడ్, ఆలయ సిబ్బంది అడెల్లి, సారంగాపూర్, కౌట్ల(బి), జామ్, ధని, మలక్ చించోలి, బీరవెల్లి, వంజర్, ప్యారమూర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆభరణాలు మూటకట్టారు. అనంతరం ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారి ఆభరణాలకు, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ఆనవాయితీ ప్రకారం అడెల్లి, కౌట్ల(బి) గ్రామాలకు చెందిన సేవదారులు అమ్మవారి నగలను ఎత్తుకుని కాలినడకన దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామంలోని గోదావరి నదికి పయనమయ్యారు. వీరిని అనుసరిస్తూ భక్తులు గోదావరికి బయలుదేరారు.

గ్రామగ్రామానా హారతులతో స్వాగతం..

అమ్మవారి నగలు ఆయా గ్రామాల గుండా ఊరేగింపుగా వెళ్తుండడంతో ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి నగల వెంట పోలీసులు, ఆలయ సిబ్బంది గోదావరి నదికి తరలివెళ్లారు. అమ్మవారి ఆభరణాల రక్షణకు నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరిగి మళ్లీ ఆదివారం ఉదయం సూర్యోదయానికి ముందే నగలశుద్ధి, పవిత్ర గోదావరి నదిలోని నీటితో జలాభిషేకం అనంతరం ఇవే గ్రామాల మీదుగా సాయంత్రానికి ఆలయానికి నగలు, గంగాజలాలు చేరుకోవడంతో జాతర ముగియనుంది.

గడముంతల్లో గంగజలాలు ....

అమ్మవారి ఆభరణాల వెంట గోదావరి నదికి బయల్దేరి వెళ్లిన భక్తులంతా తమ వెంటతీసుకెళ్లిన గడముంతల్లో గంగానది జలాలను వెంటతీసుకుని వస్తారు. ఆ నీటితో ఇళ్లలో, పంటపొలాల్లో చల్లుకుంటారు. ఇలా చల్లడంతో పాడిపంటలు, పిల్లాపాపలు చల్లగా ఉంటారని భక్తుల విశ్వాసం. అలాగే ఆయా గ్రామాల్లో అమ్మవారికి భక్తులు సమర్పించే బంగారం (పసుపు)ను భక్తులు తమవెంట తీసుకుని వచ్చి ఇళ్లలో పూజలు నిర్వహిస్తారు. ఆదివారం జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో, దేవాదాయశాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ గౌడ్, స్థానిక సర్పంచ్ సుచరిత, సారంగాపూర్ సర్పంచ్ సుజాత, ఎస్సై కృష్ణసాగర్ రెడ్డిల నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.


గంగనీళ్ల జాతరలో పాల్గొన్న వివిధ గ్రామాల భక్తులు